జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

గురువారం | 09-07-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 723 పేజీలు: 4 వెల : రూ.7

# భావనపాడు బీచ్‌లో.. ఫీ టాక్స్



- ప్రభుత్వ భూమిలో పార్కింగ్ పేరుతో వసూళ్లు
- బీచ్ రహదారికి తాడు కట్టి వాహనాలను పార్కింగ్ వైపు మళ్లింపు
- పంచాయతీ అనుమతి లేకుండానే పార్కింగ్ ఫీజుల వసూళ్లు
- ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న కొందరు
- ఉన్నతాధికారుల జోక్యం కోరుతున్న సందర్శకులు



**సంతబొమ్మాళి, జులై 8 (వార్త):** పర్యాటక కేంద్రంగా పేరొందిన భావనపాడు బీచ్‌లో వాహనాల పార్కింగ్ పేరుతో అనుమతులు లేకుండానే ఫీజులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించి విచారణ చేపట్టాలని సందర్శకులు, స్థానికులు కోరుతున్నారు. భావనపాడు బీచ్‌కు వారంలో అన్ని రోజులు సందర్శకులు వచ్చినప్పటికీ, ముఖ్యంగా ఆదివారాలు, సెలవు దినాలు, కార్తీకమాసం నుంచి సంక్రాంతి వరకు వేలాది మంది పర్యాటకులు చేరుకుంటారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, వ్యాన్లు, ప్రైవేటు బస్సులతో ఈ ప్రాంతం రద్దీగా మారుతుంది. బీచ్‌కు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో కొంత భాగాన్ని చదును చేసి వాహనాల పార్కింగ్ స్థలంగా వినియోగిస్తున్నారు. ఈ పార్కింగ్ స్థలాన్ని సంబంధిత పంచాయతీ అనుమతి లేకుండానే కొందరు స్థానికులు వేలంపాట నిర్వహించి ఒక వ్యక్తికి అప్పగించారు. వేలంపాట ద్వారా సుమారు రూ.1 లక్ష వరకు చెల్లించినట్లు ప్రచారం జరుగుతోంది. పార్కింగ్ నిర్వాహకుడు ద్విచక్ర వాహనాలకు రూ.20, ఆటోలు, కార్లు, వ్యాన్లు, బస్సులకు రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారని సందర్శకులు చెబుతున్నారు. ఈ విధంగా ఏటా రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూళ్లు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. అయితే ఈ వసూళ్లకు సంబంధించి గ్రామపంచాయతీ లేదా ఇతర ప్రభుత్వ శాఖల నుంచి అధికారిక అనుమతి ఉందా లేదా అన్నది స్పష్టత రావాల్సి ఉంది. భావనపాడు బీచ్‌కు ప్రతి సంవత్సరం వేలాది మంది పర్యాటకులు వస్తుండటంతో పార్కింగ్ నిర్వహణను అధికారికంగా గ్రామపంచాయతీ లేదా సంబంధిత శాఖ ఆధ్వర్యంలో పారదర్శకంగా చేపట్టాలి. ఒకవేళ అనధికారిక వసూళ్లు జరుగుతున్నట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సందర్శకులు, స్థానికులు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా అధికారులు విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బీచ్ రహదారికి అడ్డంగా తాడు..

పార్కింగ్ స్థలంలోకి వాహనాలను మళ్లించేందుకు బీచ్‌కు వెళ్లే రహదారికి ఇరువైపులా కర్రలు పాతి వాటి మధ్య తాడు కట్టారు. దీంతో వాహనదారులు నేరుగా బీచ్‌కు వెళ్లలేక పార్కింగ్ స్థలం గుండా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని, పాదచారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి, అనధికారికంగా పార్కింగ్ ఫీజులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని సందర్శకులు, స్థానికులు కోరుతున్నారు. అలాగే ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగకుండా, బీచ్‌కు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారులకు తెలిసినా స్పందించడం లేదు..
ప్రభుత్వ అనుమతులు లేకుండానే పార్కింగ్ ఫీజులు వసూలు చేస్తుంటే సంబంధిత శాఖలు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పర్యాటక ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి వసూళ్లు జరుగుతున్నా వాటిని అరికట్టాల్సిన బాధ్యత అధికారులదేనని సందర్శకులు అభిప్రాయపడుతున్నారు.

## అధికారులు సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు..

భావనపాడు బీచ్‌లో పార్కింగ్ ఫీజుల వసూళ్లపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ వసూళ్లకు గ్రామపంచాయతీ లేదా సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి అధికారిక అనుమతులు ఉన్నాయా? ప్రభుత్వ భూమిలో పార్కింగ్ నిర్వహించేందుకు ఎవరు అనుమతి ఇచ్చారు? వసూలు చేస్తున్న నగదు ప్రభుత్వ ఖజానాకు చేరుతోందా? లేక వ్యక్తిగతంగా వినియోగిస్తున్నారా? బీచ్ రహదారికి అడ్డంగా తాడు కట్టేందుకు ఎవరి అనుమతి తీసుకున్నారు? ఈ అంశాలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని సందర్శకులు కోరుతున్నారు.

## విచారణ చేస్తేనే బయటపడే వాస్తవాలు..

భావనపాడు బీచ్‌లో జరుగుతున్న పార్కింగ్ వసూళ్లు చట్టబద్ధమైనవా? అక్రమమా? అనే అంశంపై సంబంధిత శాఖలు సమగ్ర విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు, సందర్శకులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ భూమి వినియోగం, పార్కింగ్ అనుమతులు, వసూలైన నగదు లెక్కలు, సంబంధిత రికార్డులను పరిశీలిస్తే అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వారు పేర్కొంటున్నారు.

# క్రైం వార్తలు

# స్కెచ్ ఒకరికి.. దెబ్బ మరొకరికి..!

- వలిసినాయుడి ఇంట్లో చోరీ, మర్డర్‌కు పక్కా ప్రణాళిక
- మరో నలుగురితో చోరీకి యత్నించిన హరి
- వలిసినాయుడు ఇంటికి బదులు పొరపాటున ధనుంజయ ఇంటికి..
- ధనుంజయ కుమారుడు లింగంనాయుడు మెడపై కత్తి..
- వేరే ఇంటికి వచ్చామని గుర్తించిన హరి
- లింగంనాయుడిని బెదిరించి ఆభరణాలు చోరీ
- కేకలు వేసిన ధనుంజయ కుటుంబీకులు
- పరారైన ముఠా సభ్యులు
- పోలీసులకు ఫిర్యాదు
- ముఠా సభ్యులను గుర్తించిన ధనుంజయ కుటుంబ సభ్యులు
- ఎన్నిరామన్నపేట కూడలి వద్ద పోలీసులకు పట్టుబడిన ముఠా సభ్యులు
- వివరాలు వెల్లడించిన సీఐ ప్రసాద్




**కొత్తూరు, జులై 8 (వార్త):** పాత కక్షల నేపథ్యంలో ఒకరిని హత్య చేసి, ఆయన ఇంట్లో భారీగా దోపిడీ చేయాలనే పక్కా ప్రణాళికతో వచ్చిన నలుగురు సభ్యుల దొంగల ముఠా.. చీకట్లో దారి తప్పి వేరే ఇంట్లోకి చొరబడి.. అక్కడ ఓ యువకుడిపై దాడి చేసి బంగారు గొలుసు దోచుకెళ్లిన ఘటన కొత్తూరులో చోటుచేసుకుంది. అయితే పోలీసులు ఆ దొంగల ముఠాను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి చోరీ సొత్తుతో పాటు నేరానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనాలు, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐ చింతాడ ప్రసాద్, ఎస్ఐ కె. వెంకటేశ్ ఈ కేసు వివరాలను వెల్లడించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన సొంట్యాన నవీన్ అలియాస్ దాసు అన్నయ్య సొంట్యాన హరి కొత్తూరు పట్టణంలో ఒక పెట్రోల్ బంక్ నడుపుతున్నాడు. ఈ వ్యాపారానికి సంబంధించి రాజా వీధికి చెందిన వలిసినాయుడితో అతనికి తీవ్ర ఆర్థిక విభేదాలు ఉన్నాయి. ఈ క్రమంలో వలిసినాయుడిని మట్టుబెట్టి, అతని ఇంట్లో ఉండే పెద్ద మొత్తంలో నగదు, బంగారాన్ని కాజేయాలని హరి పథకం వేశాడు. ఈ విషయాన్ని తన తమ్ముడు నవీన్‌కు చెప్పగా, అతడు ఒంటరిగా ఈ పని చేయడం సాధ్యం కాదని భావించి.. టొంపల వినయ్ కుమార్, కొన్న తరుణ్, కురమాన శ్రీవాసరావులతో కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. హరి చెప్పిన ప్రణాళిక ప్రకారం వలిసినాయుడిని అంతమొందించడమే లక్ష్యంగా వీరంతా రంగంలోకి దిగారు. ఈ నెల 3వ తేదీ రాత్రి కత్తులు, కారంపొడి, టార్చ్ లైట్లు, ముఖాలకు ముసుగులతో ఈ ముఠా సభ్యులు రెండు ద్విచక్ర వాహనాలపై బయలుదేరారు. తెల్లవారుజామున సుమారు రెండు గంటల సమయంలో రాజా వీధికి చేరుకున్న వీరు, ఈదురుగాలులు, వర్షం కురుస్తున్న చీకటిలో వలిసినాయుడి ఇంటికి బదులుగా పొరపాటున పక్కనే ఉన్న లోతుగెడ్డ ధనంజయ్ ఇంటి వెనుక వైపునకు వెళ్లారు. అక్కడ తలుపులు రాకపోవడంతో, ప్రధాన ద్వారం లోపలి గడియ కొక్కెమును ఇనుప రాడ్‌తో విరగ్గొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. ఆ సమయంలో ధనంజయ్, ఆయన భార్య వెంకటలక్ష్మి, కుమారుడు లింగం నాయుడు నిద్రిస్తున్నారు. ఇంట్లోకి ప్రవేశించిన వెంటనే నిందితుడు టొంపల వినయ్.. ఇటీవల నడుము గాయం కారణంగా మంచానికే పరిమితమైన లింగం నాయుడు మెడపై కత్తి పెట్టి చంపబోయాడు. ఆ సమయంలో ముఠా నాయకుడు నవీన్ బాధితుల ముఖాలను చూసి, 'మనం చంపవలసిన వలిసినాయుడు ఇతను కాదు.. మనం పొరపాటున వేరే ఇంట్లోకి వచ్చాం' అని హెచ్చరించాడు. అయినప్పటికీ వెనక్కి తగ్గని వినయ్.. డబ్బు, బంగారం ఇవ్వాలంటూ బెదిరిస్తూ లింగం నాయుడు మెడలో ఉన్న ఒక తులం బంగారు గొలుసును బలవంతంగా లాక్కున్నాడు. కత్తితో బలంగా లాగడంతో బాధితుడి మెడకు గాయమైంది. బాధితులు భయంతో గట్టిగా కేకలు వేయడంతో నిందితులు కంగారుగా పారిపోయారు. పారిపోయే క్రమంలో వారి ముసుగులు ఊడిపోవడంతో స్థానికులైన సొంట్యాన నవీన్, టొంపల వినయ్, కొన్న తరుణ్‌లుగా బాధితులు గుర్తించారు.

వాహన తనిఖీల్లో దొరికిపోయారు..
బాధితుడు ధనంజయ్ ఈ నెల 4వ తేదీ సాయంత్రం కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, క్రైమ్ నంబర్ 83/2026 కింద బీఎన్ఎస్ సెక్షన్ల ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో కొత్తూరు మండలం ఎన్నిరామన్నపేట కూడలి వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. రెండు మోటార్ సైకిళ్లపై అనుమానాస్పదంగా వస్తున్న నలుగురు వ్యక్తులను ఆపి విచారించగా అసలు విషయం ఒప్పుకున్నారు. అరెస్టు అయిన వారిలో బోర వీధికి చెందిన సొంట్యాన నవీన్ అలియాస్ దాసు (30), కొత్తూరు గ్రామానికి చెందిన టొంపల వినయ్ కుమార్ అలియాస్ వినయ్ (27), శిరుసువాడకు చెందిన కొన్న తరుణ్ (21), ఎల్.ఎన్.పేట మండలం గొత్తిపల్లి గ్రామానికి చెందిన కురమాన శ్రీనివాసరావు (23) ఉన్నారు. నిందితుల నుంచి ఒక తులం బంగారు గొలుసు, రెండు పదునైన చురకత్తులు, తలుపులు బద్దలు కొట్టడానికి ఉపయోగించిన స్క్రూడ్రైవర్, ఇనుప కడ్డీ, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ ప్రసాద్ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కేసును వేగంగా ఛేదించిన పోలీస్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.



# కారుణ్య లక్కీ స్కీం పేరిట స్కాం

- రూ.80 లక్షలు వరకూ స్వాహా
- లబోదిబోమంటున్న 200 మంది బాధితులు
- కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు
- ప్రధాన నిందితుడు తంగుడు శ్రీధర్ అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ రామకృష్ణ




**పలాస, జులై 8 (వార్త):** కారుణ్య లక్కీ స్కీమ్ పేరుతో ప్రజలను ఆకర్షించి భారీ మొత్తంలో నగదు వసూలు చేసి మోసానికి పాల్పడిన ప్రధాన నిందితుడు తంగుడు శ్రీధర్‌ను కాశీబుగ్గ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను కాశీబుగ్గ సీఐ వై.రామకృష్ణ మీడియాకు బుధవారం వివరించారు. కారుణ్య లక్కీ స్కీమ్‌లో చేరితే తక్కువ పెట్టుబడితో విలువైన బహుమతులు, నగదు రాబడులు, అధిక లాభాలు వస్తాయని నమ్మించి పలాస, కాశీబుగ్గతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 200 మంది నుంచి దాదాపు రూ.80 లక్షలు వరకూ తంగుడు శ్రీధర్ కట్టించాడు. దీనికి గాను శ్రీధర్ కొందరు ఏజెంట్లను నియమించుకుని వారి ద్వారా కలెక్షన్లు చేయించాడు. ప్రారంభంలో కొందరికి బహుమతులు ఇచ్చి విశ్వాసం కల్పించిన నిందితుడు, అనంతరం డబ్బు సేకరించి బాధితులకు అందుబాటులో లేకుండా పోయాడు. దీంతో బాధితులు తాము మోసపోయామని గమనించి కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సేకరించిన ఆధారాల మేరకు ప్రధాన నిందితుడు తంగుడు శ్రీధర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్‌కు పంపించిందని సీఐ తెలిపారు. ఈ కేసులో మరిన్ని బాధితులు ఉండే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. ఇలాంటి లక్కీ స్కీమ్‌లు, అధిక లాభాల పేరుతో డబ్బులు వసూలు చేసే వ్యక్తులను నమ్మవద్దని, ఎవరైనా మోసపోయినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సీఐ ప్రజలకు సూచించారు. మీడియా సమావేశంలో సీఐ వెంట ఎస్ఐ సునీల్ ఉన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



# సేవే మహానేతకు నిజమైన నివాళి

## -వైఎస్సార్ జయంతి వేళ పలాసలో కిడ్నీ బాధితులకు దువ్వాడ శ్రీధర్ రూ.20 వేల ఆర్థిక యం

## - వైఎస్సార్ ఆశయాల స్ఫూర్తితో నిరుపేద కుటుంబాలకు అండ



**పలాస, జులై 8 (వార్త):** మహానేత దివంగత ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖరెడ్డి 77వ జయంతి సందర్భంగా పలాస నియోజకవర్గంలో మానవతా సేవా కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు ప్రముఖ న్యాయవాది, ప్రముఖ సామాజికవేత్త దువ్వాడ శ్రీధర్ (బాబా) బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. వైఎస్సార్ సేవాస్ఫూర్తిని స్మరించుకుంటూ పలాస నియోజకవర్గానికి చెందిన నలుగురు కిడ్నీ బాధితులకు వైద్య ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున మొత్తం రూ.20,000 ఆర్థిక సహాయాన్ని దువ్వాడ శ్రీధర్ (బాబా) స్వయంగా అందజేశారు.

### కిడ్నీ వ్యాధిగ్రస్తులకు చెక్కుల పంపిణీ

పలాస మండలం తర్లాకోట గ్రామానికి చెందిన కొండల మధు, వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట గ్రామానికి చెందిన కావళ్ళ శ్రీనివాస్, మందస మండలం నాతుపురం-బొడ్లలూరు గ్రామానికి చెందిన సిర్ల కళ్యాణ్, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన సైన కాంతారావులకు చెక్కులను అందజేశారు. కిడ్నీ వ్యాధి కారణంగా డయాలసిస్, మందుల ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న ఈ కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం కొంత ఊరట కలిగించింది. కిడ్నీ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులు దువ్వాడ శ్రీధర్ బాబాకు కృతజ్ఞతలు తెలిపారు.

### వైఎస్సార్ ఆదర్శాలే స్ఫూర్తి

ఈ సందర్భంగా దువ్వాడ శ్రీధర్ బాబా మాట్లాడుతూ "మహానేత డా. వైఎస్ రాజశేఖరెడ్డి పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహోన్నత నాయకుడని, ఆయన చూపిన మానవతా మార్గం నాకు ఎల్లప్పుడూ స్ఫూర్తిని, ఆరోగ్యశ్రీ, 104, 108 లాంటి పథకాలతో పేదలకు ఉచిత వైద్యం అందించిన ఘనత వైఎస్సార్ కి ఘనత దక్కిందని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో పేదవాడి ఆరోగ్యమే ప్రభుత్వ బాధ్యత అని చాటి చెప్పారు. వైఎస్సార్ పేరు చెబితేనే పేదలకు అన్నీ గుర్తుకు వస్తాయని, ఆయన జయంతి రోజున సేవా కార్యక్రమాలు చేయడం మా అదృష్టం" అని అన్నారు.

### కిడ్నీ వ్యాధి బాధితులకు అండగా నిలుస్తా

కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు వైద్య చికిత్సలు అత్యంత భారంగా మారుతున్నాయన్నారు. నెలనెలా వేల రూపాయలు ఖర్చు చేయలేక అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. "అలాంటి కుటుంబాలకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉండటం నా బాధ్యతని, అవసరంలో ఉన్న ప్రతి కుటుంబానికి నా వంతు సహాయ సహకారాలు నిరంతరం అందిస్తానని అన్నారు. పేదల చిరునవ్వే మనకు అతిపెద్ద సంతృప్తి" అని పేర్కొన్నారు. పలాస ప్రాంతంలో కిడ్నీ వ్యాధి బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఉప్పు నీటి ప్రభావం, కలుషిత తాగునీరు కారణంగా ఈ ప్రాంతంలో కిడ్నీ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు కావడంతో వేలాది మంది రోగులకు ఉచిత చికిత్స అందుతోందని గుర్తు చేశారు. ఈ సెంటర్ ద్వారా పేదలకు పెద్ద మేలు జరిగిందన్నారు. ప్రభుత్వం ఈ సెంటర్ ను మరింత అభివృద్ధి చేయాలని కోరారు.

### ఆరోగ్య రంగంలో ప్రభుత్వ నిర్లక్ష్యం

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆరోగ్య రంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని, ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోవడంతో ఆసుపత్రులు పేద రోగులకు సేవలు నిరాకరిస్తున్నాయని విమర్శించారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కొనసాగించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వైఎస్సార్ చూపిన బాటలో పేదలకు అండగా ఉండటమే అసలైన నివాళి అన్నారు. ఈ మానవతా సేవా కార్యక్రమంలో దువ్వాడ నవీన్ చౌదరి, రాంనరేష్ జినగ, అన్నెపు విజయ్, లంబాడ మోహన్ నాయుడు, మువ్వల మేఘనాథ్, బైనపల్లి కళ్యాణ్, మువ్వల కామరాజు, సుబ్బారెడ్డి, వైఎస్సార్సిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాకుళం

## ఎస్ఐఆర్ పేరుతో ఓటు హక్కును తొలగించే ప్రయత్నాలు

### - ఓటర్ల సౌలభ్యం కోసం సెప్టెంబరు15 వరకు గడువు పెంచాలి

### - పీఓడబ్ల్యూ జిల్లా కార్యవర్గం డిమాండ్




**పలాస, జులై 8 (వార్త):** భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ పేరుతో ఓటు హక్కును తొలగించే ప్రయత్నాలు తక్షణమే నిలిపివేయాలని, ఎస్ఐఆర్ ప్రోగ్రామును 15 వరకు పొడిగించాలని ప్రగతిశీల మహిళా సంఘం ( పిఓడబ్ల్యూ) శ్రీకాకుళం జిల్లా కార్యవర్గం డిమాండ్ చేసింది. బుధవారం పలాస సూదికొండలోని పీఓడబ్ల్యూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు బతకల ఈశ్వరమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, జిల్లా కమిటీ సభ్యులు సవలాపురపు కృష్ణవేణి, వంకల డిల్లేశ్వరి పాల్గొని మాట్లాడుతూ ఓటు హక్కు భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన అత్యంత విలువైన ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ముఖ్యంగా మహిళలు, పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, ఆదివాసీలు, దళితులు, వలస కార్మికులు వంటి వర్గాలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించడం కష్టంగా మారడంతో వారు ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రక్రియలో తగినంత గడువు లేకపోవడం, ప్రజలకు సరైన అవగాహన కల్పించకపోవడం, గ్రామీణ ప్రాంతాల్లో సహాయక కేంద్రాల లేమి కారణంగా లక్షలాది మంది ఓటర్లు జాబితా నుంచి తొలగిపోయే పరిస్థితి నెలకొనే అవకాశముందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం వెంటనే జోక్యం చేసుకుని ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, ఓటర్ల నమోదు దరఖాస్తుల గడువును 2026 సెప్టెంబర్ 15 వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసి మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, వలస కార్మికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి, ప్రతి అర్హుడి ఓటు హక్కును పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పీఓడబ్ల్యూ జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియ విజయవంతం ప్రతి ఒక్కరి బాధ్యత



**పలాస, జులై 8 (వార్త):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ - స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ) ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఏపీటీపీసీ ఛైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వజ్జ బాబూరావు పేర్కొన్నారు. బుధవారం పలాస స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని క్లస్టర్, యూనిట్ స్థాయి నాయకులతో సర్ కార్యక్రమంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ప్రతి వార్డు, ప్రతి బూత్ పరిధిలో సర్ ప్రక్రియ అమలు తీరును క్షుణ్ణంగా సమీక్షించారు. క్షేత్రస్థాయిలో నాయకులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారి ద్వారా తెలుసుకుని, వాటిని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని వజ్జ బాబూరావు హామీ ఇచ్చారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతి అర్హుడి వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సర్ ప్రక్రియలో పారదర్శకత, సమర్థతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి బూత్‌లో పార్టీ నాయకులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సందేహాలను నివృత్తి చేస్తూ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ముఖ్య నాయకులు, క్లస్టర్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, యూనిట్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, బూత్ స్థాయి నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్ 77వ జయంతి

### -మానసిక వికలాంగుల కేంద్రంలో పిల్లలకు అల్పాహారం పంపిణీ

### - విగ్రహం, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు



**శ్రీకాకుళం, జులై 8 (వార్త):** మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా శ్రీకాకుళం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బెహరా మానసిక వికలాంగుల కేంద్రంలో పిల్లలకు అల్పాహారం పంపిణీ చేసి కేక్ కట్ చేసి జయంతి వేడుకలను నిర్వహించారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు సనపల అన్నాజీ రావు ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏడు రోడ్ల జంక్షన్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఆయన ప్రజాసేవను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజా సంక్షేమానికి విశేష ప్రాధాన్యతనిచ్చిన నాయకుడిగా చిరస్థాయిగా గుర్తుండిపోతారని పేర్కొన్నారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నిరుపేదల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకువచ్చాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు.

## వైఎస్సార్ 77వ జయంతిని ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్



**శ్రీకాకుళం, జులై 8 (వార్త):** మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా శుక్రవారం శ్రీకాకుళం పట్టణంలో కాంగ్రెస్ నాయకులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బెహరా మానసిక వికలాంగుల కేంద్రంలో పిల్లలకు అల్పాహారం పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి వైఎస్సార్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు వైఎస్సార్ అందించిన ప్రజా సంక్షేమ పాలనను స్మరించుకున్నారు. తదనంతరం జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు సనపల అన్నాజీరావు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని ఏడు రోడ్ల జంక్షన్ కూడలిలో ఉన్న డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రైతులు, పేదలు, విద్యార్థులు, మహిళల సంక్షేమానికి వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని వైఎస్సార్‌కు ఘన నివాళులు అర్పించారు.

## వైఎస్ రాజశేఖరరెడ్డికి ఘన నివాళులు

### - విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

### - ప్రజా సంక్షేమ పథకాలతో చిరస్మరణీయ నాయకుడిగా నిలిచారు

### - మామిడి సత్యనారాయణ వ్యాఖ్య



**నరసన్నపేట, జులై 8 (వార్త):** మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా నరసన్నపేటలోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరసన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మామిడి సత్యనారాయణ మాట్లాడుతూ, దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు లక్షలాది మంది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఇంజినీర్లు, వైద్యులుగా ఎదగడానికి అవకాశం కల్పించారని కొనియాడారు. అలాగే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వేలాది మంది పేదలకు ఉచిత వైద్య సేవలు అందించి ప్రాణదాతగా నిలిచారని పేర్కొన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు గృహాలు మంజూరు చేసి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన నాయకుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అని, కాంగ్రెస్ పార్టీ చరిత్రలో ఆయన సేవలు చిరస్మరణీయమని మామిడి సత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి భేరి వెంకటరమణ, నరసన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుట్టు కృష్ణమోహన్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

### మధ్యాహ్న భోజన పథకాన్ని..

## సక్రమంగా అమలు చేయాలి

### -విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

### -ఎంఈఓ బమ్మిడి మాధవరావు

### - జలుమూరు మోడల్ ప్రాథమిక పాఠశాల తనిఖీ



**జలుమూరు, జులై 8 (వార్త):** విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని నిబంధనలకు అనుగుణంగా సక్రమంగా నిర్వహించాలని మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) బమ్మిడి మాధవరావు సూచించారు. బుధవారం జలుమూరు మండల కేంద్రంలోని మోడల్ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు పరిశుభ్రమైన, పోషక విలువలు కలిగిన రుచికరమైన భోజనం అందించడం పథకం ప్రధాన ఉద్దేశమని అన్నారు. భోజన తయారీ నుంచి వడ్డించే వరకు పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన ఆహారం అందేలా ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని, మధ్యాహ్న భోజన పథకం అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని ఎంఈఓ స్పష్టం చేశారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

# ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

### - వైఎస్సార్ ఆశయ సాధనకు కృషి చేయాలి

### - డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య

### - నియోజకవర్గ వ్యాప్తంగా విగ్రహాలకు నివాళులు, కేక్ కట్ చేసి వేడుకలు





**నరసన్నపేట, జులై 8 (వార్త):** దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పోలాకి జడ్పీటీసీ, యువ నాయకుడు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య పిలుపునిచ్చారు. బుధవారం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని నరసన్నపేట నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. పోలాకి మండలం ఈదులవలస, నరసన్నపేట మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం, నరసన్నపేట పట్టణంలోని వైఎస్సార్ జంక్షన్, ఉర్లాం గ్రామం, జలుమూరు మండలం కొమనపల్లి జంక్షన్‌లలో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు, పేదలు, విద్యార్థులు, మహిళల సంక్షేమానికి వైఎస్సార్ అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ఆయన అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు నేటికీ ఆదర్శంగా నిలిచాయని అన్నారు. వైఎస్సార్ చూపిన మార్గంలోనే ప్రజాసేవ కొనసాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం నరసన్నపేట పట్టణంలోని వైఎస్సార్ జంక్షన్ వద్ద డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య సమక్షంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ కేక్ కట్ చేసి వైఎస్సార్‌ను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి జయంతి వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్సీపీ ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైఎస్సార్‌కు ఘన నివాళులర్పించారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహోన్నత నేత వైఎస్

### -పలాసలో ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

### - ఘనంగా వైఎస్సార్ విగ్రహానికి నివాళులు - సంక్షేమ పాలనను గుర్తు చేసిన నేతలు

**పలాస, జులై 8 (వార్త):** ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి మహోన్నత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి అని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పేర్కొన్నారు. పలాసలోని సంత మైదానం వద్ద ఉన్న వైయస్సార్ విగ్రహానికి, కిడ్నీ పరిశోధన కేంద్రం ప్రాంగణంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహానేత వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు సమర్పించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ప్రజా సంక్షేమానికి కొత్త దిశ చూపిన నాయకుడని కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టిన 108 అంబులెన్స్ సేవలు, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు ఉచిత విద్యుత్ వంటి పథకాలు దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. ఆ సంక్షేమ భావజాలాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరింత విస్తరించి ప్రజలకు చేరువ చేశారని అన్నారు. పలాస నియోజకవర్గ అభివృద్ధిలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కీలక పాత్ర పోషించారని ఆయన తెలిపారు. కిడ్నీ పరిశోధన కేంద్రం, ఆధునిక వైద్యసదుపాయాలతో ఆసుపత్రి నిర్మాణం, పలాసకు రెవెన్యూ డివిజన్ మంజూరు, సుమారు రూ.700 కోట్లతో సుజలధార ప్రాజెక్టు అమలు వంటి అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టుల వద్ద స్థానిక ప్రజాప్రతినిధులు ఫోటోలు దిగుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన "సూపర్ సిక్స్" హామీలను అమలు చేయడంలో విఫలమైందని మాజీ మంత్రి విమర్శించారు. "తల్లికి వందనం", "మహాశక్తి" వంటి పథకాలు అమలు కాకపోవడంతో ప్రజలు నిరాశకు గురయ్యారని, కొత్త పింఛన్ల మంజూరులో కూడా ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేయడం, విమర్శించే గొంతులను అణచివేయడం ద్వారా ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తున్నారని నాయకులు మండిపడ్డారు.



ప్రజల ఆశీస్సులతో మళ్లీ సంక్షేమ పాలన రాష్ట్రంలో నెలకొంటుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. చివరగా మహానేత వైఎస్సార్ ఆశయాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమం ముగింపులో కార్యకర్తలు "జోహార్ వైఎస్సార్", "వర్ధిల్లాలి జగనన్న నాయకత్వం" అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పలాస వైసీపీ పట్టణ అధ్యక్షులు శిస్టు గోపి, మండల పార్టీ అధ్యక్షులు దువ్వాడ రవి, మాజీ పిఏసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరమణ (చిట్టి), ఉంగ సాయి కృష్ణ, బమ్మిడి దుర్యోధన, మాజీ పలాస మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్ బాబు, పార్టీ నాయకులు, మహిళలు, యువకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా వైఎస్ జయంతి వేడుకలు





**మందస, జులై 8(వార్త):** మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జన్మదిన వేడుకలు మందస మండలంలో ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి విశ్వసనీయతకు మారు పేరుగా నిలిచారని కొనియాడారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇచ్చిన వైఎస్సార్ ఎప్పటికీ ప్రజల మనసుల్లో కొలువై ఉంటారన్నారు. తెలుగు నేలపై సంక్షేమ పునాదులు నిర్మించి ప్రజల గుండెల్లో చెదరని జ్ఞాపకంగా నిలిచిపోయిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయసాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మందస మండలంలోని ఉమాగిరి, బుడారిసింగి, భైరిసారంగపురం, హరిపురం, రట్టి, భేతాళపురం గ్రామాల్లో గల వైఎస్సార్ విగ్రహం వద్ద 77వ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి అగ్గున్న సూర్యారావు, మండల అధ్యక్షుడు దల్లి జానకిరావురెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు గిన్ని తిరుపతి రెడ్డి, మండల యువజన అధ్యక్షుడు శానాపతి కిషోర్ కుమార్, మందస పట్టణ అధ్యక్షుడు సిందిరి జగన్, చింతాడ గణపతి, చెరుకుపల్లి లక్ష్మణమూర్తి, ఎంపీటీసీ కంచిబెహరా, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ మాజీ బోర్డ్ మెంబర్ బత్తిని లక్ష్మణ్, అందాల శేషగిరిరావు, పులారి కూర్మారావు, పితాంబరం, దున్న హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

### - టీడీపీ వమండల అధ్యక్షుడు బావన దుర్యోధన

**మందస, జులై 8(వార్త):** ప్రజల సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వ లక్ష్యమని తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన అన్నారు. మందస పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష ఆదేశాల మేరకు మందస మండల తెలుగుదేశం పార్టీ సమీక్షా సమావేశం జరిగిందన్నారు. పార్టీ బలోపేతం ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే దిశగా సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు. పలాస నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష నాయకత్వంలో, మందస మండలాన్ని జిల్లాలోనే ఆదర్శవంతమైన మండలంగా తీర్చిదిద్దడానికి ప్రతీ ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మందస మండలంలోని పలు గ్రామ పంచాయతీల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తక్షణ సమస్యలు మరియు వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్రస్థాయి నాయకులతో కలిసి సుదీర్ఘంగా చర్చించారు. మందస మండలంలో త్వరితగతిన అభివృద్ధి పనులు జరిగేలా చూస్తూ, తమ వంతుగా సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని పార్టీ శ్రేణులకు మరియు ప్రజలకు ఆయన గట్టి నమ్మకాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో మందస మండల కార్యదర్శి సాలీన మాధవరావు, లబ్బ రుద్రయ్య, తమిరియ భాస్కరరావు, కొర్ల కన్నారావు, బమ్మిడి కర్రయ్య, ముంజేటి చంద్రశేఖర్రావు, అడ్డి ఈశ్వరరావు, బేసి ఈశ్వరరావు, బైరిశెట్టి గున్నయ్య, తమ్మినేని ధనుంజయ, రట్టి లింగరాజు, కర్రక హరికృష్ణ, బావన ఢిల్లేశ్వరరావు, కుప్పిలి వెంకటరావు, మండల లచ్చయ్య, మెట్ట మహేశ్వరరావు తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

### - వ్యవసాయ శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీలు

### - ఏపీఐఎంఎస్ యాప్‌లో విక్రయాల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి



**నరసన్నపేట, జులై 8 (వార్త):** ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి ఎరువులను విక్రయించే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ ఏడీ ఎల్వీ మధు, వ్యవసాయ శాఖ అధికారిణి వై. సూర్యకుమారి హెచ్చరించారు. మంగళవారం నరసన్నపేట మండలంలోని మడపాం, కోమర్తి తదితర ప్రాంతాల్లో ఉన్న ఎరువుల దుకాణాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు, విక్రయ రికార్డులు, ధరల పట్టికలు, స్టాక్ వివరాలను పరిశీలించి నిబంధనల అమలుపై ఆరా తీశారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలని, అధిక ధరలు వసూలు చేయడం, కృత్రిమ కొరత సృష్టించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఏపీ ఐఎంఎస్ యాప్‌లో ఎరువుల విక్రయాలకు సంబంధించిన వివరాలను వెంటనే నమోదు చేయాలని డీలర్లకు సూచించారు. విక్రయాల సమాచారాన్ని సకాలంలో నమోదు చేయడం ద్వారా ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటుందని తెలిపారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ఎవరైనా అధిక ధరలకు ఎరువులు విక్రయించినట్లు గుర్తిస్తే సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని అధికారులు కోరారు.



## శిథిలావస్థలో జగన్నాథపురం ప్రభుత్వ పాఠశాల

### - ప్రమాదకరంగా మారిన భవనం

### - విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రుల ఆందోళన

### - ప్రహరీతో పాటు ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని గ్రామస్థుల విజ్ఞప్తి

**సారవకోట, జులై 8 (వార్త):** జగన్నాథపురంలోని ప్రభుత్వ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థుల భద్రతపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల భవనానికి సంబంధించిన గోడలు బీటలు వారి ఎప్పుడు కూలిపోతాయోనన్న పరిస్థితి నెలకొనడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనల మధ్య విద్యాబోధన కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల తరగతి గదుల్లో విద్యార్థులు కూర్చునే గచ్చులు కూడా పూర్తిగా దెబ్బతినడంతో చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు పాఠశాల భవనాన్ని పరిశీలించి మరమ్మతులు చేపట్టడం లేదా కొత్త భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అదేవిధంగా పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో బయటి వ్యక్తులు, పశువులు ఆవరణలోకి ప్రవేశించే పరిస్థితి ఉందని తెలిపారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా తక్షణమే ప్రహరీ గోడ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఇక పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూడా ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు రాకపోకలు సాగించే ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ఎలాంటి ప్రమాదం జరగకుండా విద్యుత్ శాఖ అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు, భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి పాఠశాల సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు.

## మహిళా సంఘాలకు పుస్తక నిర్వహణే ప్రాణవాయువు

**మందస, జులై 8(వార్త):** మహిళా స్వయం సహాయక సంఘాల పని తీరులో ఆర్థిక లావాదేవీల పారదర్శకత, పుస్తక నిర్వహణే కీలకమని, ప్రాణవాయువు వంటిదని వెలుగు గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం ముందుగా డబ్బులు చెల్లించిన గ్రామ సంఘాలకు కొత్త పుస్తకాలను పంపిణీ చేయించారు. స్వయం సహాయక సంఘాల ఆర్థిక లావాదేవీలు సభ్యురాలు స్థాయి వరకు కొత్త పుస్తకాలు లో పారదర్శకం గా నమోదు చేయడం కోసం శిక్షణ ఇచ్చారు. మన డబ్బులు మన లెక్కలు కార్యక్రమం విజయవంతం కావాలని సిబ్బందికి సూచించారు . ప్రతీ సంఘానికి కూడా ప్రభుత్వం ఎంటర్ ప్రైనర్ లు గా ప్రోత్సహించడానికి అవసరమైనంత మొత్తంలో లోన్స్ గ్రౌండింగ్ చేస్తున్నప్పుడు పుస్తక నిర్వహణ సరిగా లేకపోతే సభ్యుల మధ్య అపోహలు ఏర్పడి గ్రామాలలో మహిళల మధ్య మనస్పర్థలు వచ్చి జవాబుదారీతనం లేకుండా స్థానిక సిబ్బంది ఇబ్బందులు పడకుండా జాగ్రత్త పడమని సూచించారు. కార్యక్రమంలో లీగల్ కోఆర్డినేటర్ తారక మోహన్, క్లస్టర్ కోఆర్డినేటర్లు ముఖలింగం, బాలక్రిష్ణ, మండల సమాఖ్య సిబ్బంది, వీఓఏలు పాల్గొన్నారు.



## శ్రీకాకుళం

### ప్రభుత్వ పాఠశాలలకు యూనిఫాం పంపిణీ ప్రారంభం

### - మొదటి విడతలో 4,334 మంది విద్యార్థులకు

### - మిగిలిన యూనిఫాంలు త్వరలో అందజేస్తాం

### - ఎంఈఓ పేడాడ దాలినాయుడు



**నరసన్నపేట, జులై 8 (వార్త):** సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లలో భాగంగా ప్రభుత్వం పంపిన యూనిఫాం వస్త్రాలను ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేస్తున్నట్లు నరసన్నపేట మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) పేడాడ దాలినాయుడు తెలిపారు. బుధవారం నరసన్నపేట బోర్డు ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిల్వ ఉంచిన యూనిఫాం వస్త్రాలను క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ (సీఆర్పీలు) ద్వారా ఆయా ప్రభుత్వ పాఠశాలలకు తరలించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, నరసన్నపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 4,578 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. మొదటి విడతలో 4,334 మంది విద్యార్థులకు సరిపడా యూనిఫాం వస్త్రాలు అందాయని, మిగిలిన విద్యార్థులకు అవసరమైన యూనిఫాంలు కూడా త్వరలోనే అందించి పంపిణీ పూర్తి చేస్తామని చెప్పారు. విద్యార్థులు కొత్త విద్యా సంవత్సరాన్ని యూనిఫాంలతో ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, సరఫరా ప్రక్రియను వేగవంతం చేసి అన్ని పాఠశాలలకు సకాలంలో చేరేలా చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పంపిణీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత సీఆర్పీలకు సూచించారు.

## భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

### - నరసన్నపేటలో సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

### - చెరువులు, ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

### -కొన్న శ్రీనివాస్ డిమాండ్




**నరసన్నపేట, జులై 8 (వార్త):** నరసన్నపేటలో జరుగుతున్న భూ ఆక్రమణలపై సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మండలంలో భూ మాఫియా కార్యకలాపాలు పెరిగిపోయాయని ఆరోపించారు. ప్రభుత్వ భూములతో పాటు ప్రజలకు ఉపయోగపడే స్థలాలు, మంచినీటి చెరువులు కూడా కబ్జాలకు గురవుతున్నాయని విమర్శించారు. మండల పరిధిలోని పలు మంచినీటి చెరువులు ఆక్రమణలకు గురికావడంతో వాటి విస్తీర్ణం క్రమంగా తగ్గిపోతోందని, దీనివల్ల భవిష్యత్తులో తాగునీటి కొరతతో పాటు పర్యావరణ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నారని ఆరోపించారు. అక్రమ ఆక్రమణలను గుర్తించి వెంటనే తొలగించాలని, ప్రభుత్వ భూములు, చెరువులను పరిరక్షించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కొన్న శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రజా ఆస్తులను కాపాడేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని భూ ఆక్రమణలను అరికట్టాలని నినాదాలు చేశారు.

## మాదకద్రవ్యాలపై యువత అప్రమత్తంగా ఉండాలి

### - విద్యార్థులకు ఈగల్ టీం అవగాహన కార్యక్రమం

### -చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచన

**నరసన్నపేట, జులై 8 (వార్త):** సమాజంలో యువతను లక్ష్యంగా చేసుకుని మాదకద్రవ్యాల విక్రయాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఈగల్ టీం సభ్యులు ఉదయ్ కుమార్, రామచంద్రం సూచించారు. మంగళవారం రాత్రి నరసన్నపేట మండలం గొట్టిపల్లి గ్రామంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మాదకద్రవ్యాల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు భవిష్యత్తు కూడా దెబ్బతింటుందని వివరించారు. సరదా కోసం కూడా ఎలాంటి వ్యసనాలకు అలవాటు పడకూడదని, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఎవరైనా మాదకద్రవ్యాలు వినియోగించాలని లేదా విక్రయించాలని ప్రోత్సహిస్తే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. విద్యార్థులు చదువుపై పూర్తి దృష్టి సారించి మంచి లక్ష్యాలతో ముందుకు సాగాలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు విద్యార్థుల అవగాహన, భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, ఈగల్ టీం సభ్యులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



### వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ సెక్రటరీని కలిసిన

## ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు



**పలాస, జులై 8 (వార్త):** వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ సెక్రటరీని కలిసిన ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు రోణంకి గోపాలకృష్ణ వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ సెక్రటరీటు ఏపీ గవర్నమెంట్ను విజయవాడ సెక్రెటేరియట్ నందు బుధవారం కలవడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బోనెల గోపాల్ తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖలో పదోన్నతులు, జోనల్ విధానం, ప్రెసిడెన్షియల్ 2025 స్థానికత అంశాలపై రిప్రజెంటేషన్ సందర్భంగా వినతి పత్రాన్ని సమర్పించారు. దీనిపై సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని సెక్రటరీ హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి సహకరిస్తానని సానుకూలంగా తెలిపారు.

## విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణగా మెలగాలి



**మందస, జులై 8(వార్త):** విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో ఉండాలని కాశీబుగ్గరూరల్ సీఐ పి.తిరుపతిరావు, మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ కోరారు. మందస మండలంలోని బాలిగాం గ్రామం వద్ద గల ఆదిత్య కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో అభయం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు నిబద్ధతతో ముందుకు సాగాలని, ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడంతో ప్రాణాలు కోల్పోతున్నారని, వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కృషి, పట్టుదల అంకితభావంతో చదువుకోవాలని, మంచి భవిష్యత్ పొందాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారురు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, ఎన్ఎస్ఎస్ పీఓలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఘనంగా వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం



**ఇచ్ఛాపురం, జులై 8(వార్త):** బొడ్డకాళి గ్రామంలో కళ్యాణవెంకటేశ్వర స్వామి ఆలయం 23వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజ లో ఇచ్ఛాపురం మండలం మాజీ ఎంపీపీ దక్కతఢిల్లీరావు , ఎపి రాష్ట్ర ప్రభుత్వ నాటక అకాడమీ డైరెక్టర్ దక్కత కామేశ్వరరావురెడ్డి,. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు లోపింటి పద్మనాభం, వి ధర్మరాజు, నీలవేణి,బి అప్పన్న, బీమరాజు,బి.మోహన్,ఎల్.వెంకట రావు,గ్రామ పెద్దలు పూజ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా దివంగత నేత రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు

**ఎల్ఎన్ పేట, జులై 8(వార్త):** దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలు పాతపట్నం నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. వైఎస్ఆర్సిపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మాజీ స్పీకర్, వైఎస్ఆర్సిపి పీ ఏ సి సభ్యులు, జిల్లా పార్లమెంట్ ఇంచార్జ్ శ్రీ తమ్మినేని సీతారాం హాజరయ్యారు. ముందుగా నాయకులందరితో కలసి దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాతపట్నం సామాజిక ఆరోగ్య కేంద్రం లోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు. స్థానిక ఖూవీ ప్లాజా నందు మెగా వైద్య శిబిరాన్ని మరియు రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి జయంతి వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాతపట్నం, మెలియాపుట్టి, హిరమండలం, ఎల్ఎన్ పేట, కొత్తూరు మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# పేదవాడి గుండె చప్పుడు డాక్టర్ వైయస్సార్

### -మాట తప్పని మహానేత..మరువని మహా పథకాలు

### జన హృదయ నేతకు ఘనంగా నివాళులర్పించిన మున్సిపల్ మాజీ చైర్మన్ బల్ల గిరిబాబు



**పలాస, జులై 8 (వార్త):** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి పేద ప్రజల కోసమే జీవించిన జన హృదయ నేత. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్, 108, 104 వంటి మరువని మహా పథకాలతో కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నింపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పాలన అందించినందుకే ఆయన "మాట తప్పని మహానేత"గా చరిత్రలో నిలిచారు. వైయస్సార్ 77వ జయంతి సందర్భంగా పలాస-కాశీబుగ్గ సంత మైదానంలో ఉన్న ఆయన విగ్రహానికి పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం తాజా మాజీ చైర్మన్ బల్ల గిరిబాబు పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బల్ల గిరిబాబు మాట్లాడుతూ "వైయస్సార్ శరీరంతో మన మధ్య లేకపోయినా ఆయన ఆశయాలు సజీవంగా ఉన్నాయి. పేదవాడి కన్నీరు తుడిచేందుకు ఆయన రూపొందించిన పథకాలు నేటికీ కోట్లాది కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయి. ఆయన చూపిన సంక్షేమ బాటలోనే నేడు ఆయన కుమారుడు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పాలన చేస్తున్నారు. తండ్రి ఆశయాలే స్ఫూర్తిగా తీసుకొని అమ్మ ఒడి, వైఎస్ఆర్ రైతు భరోసా, వైఎస్ఆర్ ఆసరా, చేయూత, వైఎస్ఆర్ నవసకం వంటి పథకాల ద్వారా ప్రతి ఇంటికి సంక్షేమాన్ని అందించి చేసి చూపించారు. వైయస్సార్ అంటే ఒక వ్యక్తి మాత్రమే కాదు. అది ఒక సంక్షేమ సిద్ధాంతం. ఆ సిద్ధాంతం ఈ తెలుగు నేలపై చిరకాలం నిలిచిపోతుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జుట్టు నీలకంఠం, ఎక్స్ ఎంపీటీసీ మరణ భాస్కర్ రెడ్డి, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు వల్లభ వైకుంఠరావు, డి. నాగభూషణ రావు, పి. ప్రభాకర్ రావు, బిరగళ్ల ప్రసాద్, రాజారావు, మోటార్ యూనియన్ నాయకులు తో పాటు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## ఘనంగా వైఎస్ఆర్ 77వ జయంతి వేడుకలు



**ఇచ్ఛాపురం, జులై 8(వార్త):** దివంగత ముఖ్యమంత్రి వైయస్ఆర్ 77వ జయంతి సందర్భంగా వైయస్ఆర్ విగ్రహానికి ఘన నివాళు లు అర్పించారు. సమన్వయకర్త సాడి శ్యామ్ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ పిరియా విజయమ్మ, రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, మాజీ ఛైర్ పర్సన్ పిలక రాజలక్ష్మి, ఎంపిపి బోర పుష్ప, జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు ఆసి కృష్ణరెడ్డి తదితరులు. పాల్గొన్నారు. అనంతరం రక్తదాన శిబిరం, మెడికల్ క్యాంపు, అన్నదానం నిర్వహించారు. శ్యామ్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, వైయస్ఆర్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో స్వర్ణయుగాన్ని చూసిందన్నారు. పేద ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఆరోగ్యశ్రీ, అత్యవసర వైద్య సేవల కోసం 108, గ్రామీణ ప్రజలకు 104 వైద్య సేవలు, అర్హులందరికీ గృహ నిర్మాణం, రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేసి కోట్లాది మంది ప్రజల గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్న మహానేత వైయస్ఆర్ అని కొనియాడారు. మహానేత వైయస్ఆర్ చూపిన మార్గంలోనే నడుస్తూ ఆయన ఆశయాల సాధనకు జగనన్న ఆదేశాలను త్రికరణశుద్ధిగా పాటిస్తూ మరలా రాజన్న పాలన సాధించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి అంటే ఏమిటో, సంక్షేమ పాలన ఎలా ఉండాలో మహానేత వైయస్ఆర్ తన పాలనతో దేశానికే ఆదర్శంగా చూపించారని అన్నారు. రైతు, పేద, విద్యార్థి, మహిళ, కార్మికుడు ఇలా సమాజంలోని ప్రతి వర్గం సంక్షేమమే ఆయన పాలన లక్ష్యమని పేర్కొన్నారు. అందుకే ప్రజల హృదయాలలో వైయస్ఆర్ శాశ్వతంగా నిలిచిపోయారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి వైయస్ఆర్ అభిమానిగా మా బాధ్యత అని అన్నారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున జోహార్ వైయస్ఆర్, వైయస్ఆర్ ఆశయాలే మాకు మార్గదర్శకాలు అంటూ నినాదాలు చేస్తూ మహానేతకు ఘనంగా నివాళులర్పించారు. అదేవిదంగా నియోజకవర్గం 4 మండలాలలో వైస్సార్ విగ్రహాల వద్ద నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై నివాళులు అర్పించారు. కార్యక్రమాలలో ఎంపీపీ లు, జడ్పీటీసీ లు, మండలం పార్టీ అధ్యక్షులు,మున్సిపాలిటీ మాజీ కౌన్సెలర్ లు ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్ లు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువత భారీగా పాల్గొన్నారు.

## మహానేత వైయస్సార్ ఆశయాలు కొనసాగిద్దాం

### - జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



**సోంపేట, జులై 8(వార్త):** మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలను తప్పకుండా కొనసాగించాలని మనమంతా అందుకు పునరంకితం కావాలని జడ్పీ చైర్పర్సన్ విరియా విజయ పిలుపునిచ్చారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ జయంతిని సోంపేటలో బుధవారం నిర్వహించారు. వైయస్ విగ్రహానికి ఎంపీపీ డాక్టర్ నిమ్మనదాసు, జడ్పిటిసి సభ్యురాలు తడక యశోద,పలువురు నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి పదవికి ఒక ప్రత్యేకత తీసుకురావడం గొప్ప విషయమని అన్నారు. ఆయన పరిపాలన దక్షత,పేదలకు రూపొందించి విజయవంతంగా అమలు చేసిన సంక్షేమ పథకాలు ఇప్పటికీ ప్రజల హృదయాల్లో చెక్కుచెదరలేదని అన్నారు. విద్యా, వ్యవసాయం,సంక్షేమం, అభివృద్ధి పట్ల వైయస్సార్ నిబద్ధత ఎనలేనిదని అన్నారు. అటువంటి మహానుభావుని లక్షణాలను పుణికి పుచ్చుకున్న వైయస్ జగన్ పరిపాలనలో తండ్రికి మించిన తనయుడుగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో వైసీపీ నాయకులు తడక జోగారావు, పొడుగు కామేష్,మల్లా వెంకటరమణ, సకల భక్తుల హరీష్ కుమార్,బదకల మోహన్ రావు,పిట్ట సంతోష్ ,జక్కం రమేష్,శిలగాన భాస్కరరావు, పిట్ట హేమారావు,ఉత్తరాల వెంకన్న, పిట్ట హేమ సుందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దింటి బిడ్డ వైద్యుడిగా ఎదగడం అభినందనీయం

### -లొడగల కామేశ్వరరావు యాదవ్


**పలాస, జులై 8(వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పద్మనాభపురం గ్రామానికి చెందిన కొండె నరసింహ కుమారుడు డా. కొండె రాజ్‌కుమార్ ఫిలిప్పీన్స్ దేశంలో 5½ సంవత్సరాల ఎం.బి.బి.ఎస్. (జనరల్ మెడిసిన్) విద్యను విజయవంతంగా పూర్తి చేసి, భారతదేశంలో నిర్వహించిన అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన సందర్భంగా రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ వారి నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందించి, దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ ఒక సాధారణ, నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన యువకుడు విదేశాల్లో వైద్య విద్యను పూర్తిచేసి, భారతదేశ అర్హత పరీక్షలో కూడా విజయం సాధించడం గొప్ప విషయమని అన్నారు. ఇటువంటి విజయాలు ఒక్కరోజులో సాధ్యమయ్యేవి కావని, వాటి వెనుక సంవత్సరాలపాటు కఠోర శ్రమ, అచంచలమైన ఆత్మవిశ్వాసం, తల్లిదండ్రుల త్యాగం, కుటుంబ సభ్యుల సహకారం ఉంటాయని పేర్కొన్నారు. "కొడుకు పుట్టినప్పుడు మాత్రమే కాదు... తన ప్రతిభతో తల్లిదండ్రులకు, పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకొచ్చినప్పుడే నిజమైన పుత్రోత్సాహం కలుగుతుంది" అని మన పెద్దలు చెప్పిన మాటను డా. రాజ్‌కుమార్ నిజం చేశారని కొనియాడారు. ఆయన సాధించిన విజయం పద్మనాభపురం గ్రామానికే కాకుండా పలాస ప్రాంతానికే గర్వకారణమని తెలిపారు. వైద్య వృత్తిలో అడుగుపెట్టిన అనంతరం పేద ప్రజలకు అండగా నిలుస్తూ, సేవా దృక్పథంతో వైద్య సేవలు అందించాలని, తన జ్ఞానాన్ని సమాజ హితానికి వినియోగిస్తూ దేశానికి, రాష్ట్రానికి, పుట్టిన గ్రామానికి, తల్లిదండ్రులకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అంబటి కృష్ణమూర్తి, గురిటి సూర్యనారాయణ, సవర రాంబాబు, బద్రి గోపాల్‌రావు, కొవ్వూరు సురేష్, కొరికాన శంకరరావు, తెప్ప గణేష్, మురపాల నాగరాజు, కంచరాన తారక రమేష్, కొండె తిరుపతి, బుడత జగదీష్, ఉంగ తిరుపతి, భుజంగరావు, జోగ తిరుపతి, కొర్రాయి బాలకృష్ణ, జనార్ధన్, కావల్ల చంటిబాబు, పులారి పాపారావు, బమ్మిడి పోలినాయుడు, మణి, తదితర నాయకులు, అభిమానులు, ఆత్మీయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి సహాయనిధి పంపిణీ

### - పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్ - బగ్గు అర్చన

### - లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి చెక్కుల అందజేత



**పోలాకి, జులై 8(వార్త):** పేద కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించి ఆర్థిక భరోసా కల్పించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన అన్నారు. మంగళవారం పోలాకి మండలంలోని పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా దీర్ఘాశి గ్రామానికి చెందిన మెండ తాతయ్యకు రూ.40,896, ఈదలవలస గ్రామానికి చెందిన బొమ్మాలి భాస్కరరావుకు రూ.66,281, చెల్లాయివలస గ్రామానికి చెందిన కోట బైరాగికి రూ.60,734 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. అనంతరం బగ్గు అర్చన మాట్లాడుతూ, పేద ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. వైద్య చికిత్స కోసం నిరుపేద కుటుంబాలు అప్పుల పాలుకాకుండా వారికి ఆర్థిక సహాయం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి సహాయనిధిని సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. అవసర సమయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పోలాకి పీఏసీఎస్ చైర్మన్ భైరి భాస్కరరావు, మాజీ సర్పంచ్ పల్లి సూరిబాబు, పల్లి మల్లేష్, మెండ రమణయ్య, మెండ ఈశ్వరరావు, బొమ్మాలి బలరాం, దండుపాటి యర్రయ్య, బోర వెంకట్రావు, బోర యశోదతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## శ్రీముఖలింగంలో వైఎస్సార్ 77వ జయంతి వేడుకలు

### -అభాగ్యులకు చీరలు, వస్త్రాలు, మిఠాయిల పంపిణీ



**జలుమూరు, జులై 8(వార్త):** శ్రీముఖలింగంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీకాకుళం పార్లమెంట్ మాజీ కాంగ్రెస్ అభ్యర్థి (2024), ప్రదేశ్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాయుడుగారి రాజశేఖర్ కార్యక్రమానికి హాజరై నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి అభాగ్యులు, మహిళలకు చీరలు, వస్త్రాలు, మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయుడుగారి రాజశేఖర్ మాట్లాడుతూ, డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలు దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచాయని అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఆయన పాలన సాగిందని, మరో పదేళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగి ఉంటే రాష్ట్రం మరింత అభివృద్ధి, సంక్షేమ దిశగా పయనించేదని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర విభజనను నివారించేందుకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి కృషి చేశారని, అనంతర పరిణామాలతో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా లేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన వనరుల సమీకరణలో సవాళ్లు ఎదురవుతున్నాయని అన్నారు. జలుమూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుంట కర్ణవీరుడు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సంక్షేమానికి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజల హృదయాల్లో ఆయనకు ప్రత్యేక స్థానం ఎప్పటికీ నిలిచి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## హెల్మెట్ మరవద్దు.. కుటుంబానికి దూరం కావద్దు

**మందస, జులై 8(వార్త):** ప్రయాణంలో హెల్మెట్ అతి ముఖ్యమని, హెల్మెట్ ధరించడం ఎట్టి పరిస్థితుల్లో మరవద్దని, కుటుంబానికి దూరం కావద్దని కాశీబుగ్గరూరల్ సీఐ పి.తిరుపతిరావు, మందస ఎస్ కె.కృష్ణప్రసాద్ అన్నారు. మందస మండలంలోని హరిపురంలో అభయం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ప్రయాణ సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ హెల్మెట్ మరువ వద్దని ప్రమాదాలతో వారి కుటుంబాలకు దూరం కావద్దని హితవు పలికారు. ప్రయాణంలో ప్రమాదాలు జరిగే సందర్భాల్లో ప్రాణం కాపాడేది ఒక్క హెల్మెట్ మాత్రమేనని పేర్కొన్నారు. ప్రతీ వ్యక్తి ప్రయాణంలో హెల్మెట్ పట్ల నిర్లక్ష్యం చేయవద్దని పేర్కొన్నారు. తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు లేక నిలువునా ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రమాద సమయంలో హెల్మెట్ ఉండటం వలన తల సురక్షితంగా ఉంటుందని తద్వారా ప్రాణాపాయం నుంచి రక్షించబడతారన్నారు. ప్రాణం ఖరీదు చాలా విలువైనదని గుర్తు చేశారు. నిర్లక్ష్య ప్రయాణాలు ద్వారా ప్రాణాలు కోల్పోయి ఆయా కుటుంబాలకు ఆసరా లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాలకు అండగా ఉండవలసిన వ్యక్తులు రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలై ప్రాణాలు కోల్పోవడం ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపుతుందని అన్నారు. రోడ్లపై పోలీసులు పట్టించుకోవడం లేదన్న తేలిక భావనతో హెల్మెట్ ధరించకుండా ప్రయాణించడం వారికి, వారి కుటుంబాలకు తీవ్ర ప్రమాదకరమని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. ప్రభుత్వ చట్టాలు కఠినంగా ఉన్నాయని, చర్యలు కూడా కఠినంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546